క్లుప్తంగా

ట్రిపుల్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కి డాక్టరేట్


వినోద్‌కుమార్

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కేతినేని వినోద్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. చెన్నైలోని వెల్స్ యూనివర్సిటీలోని సీఎస్ఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో లోడ్ బ్యాలెన్సింగ్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ పైన ఆయన పరిశోధన చేశారు. దీంతో చెన్నైలోని వెల్స్ యూనివర్సిటీ నుంచి ఆయన పీహెచ్‌డీ పట్టా పొందారు. వినోద్‌కుమార్‌ను ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలనాధికారి రవికుమార్, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని గుంతబజార్ ప్రాంతంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని 11 కేవీ డిగ్రీ కళాశాల ఫీడర్ కింద ట్రాన్స్‌ఫార్మర్ ఎరెక్షన్ ఉన్న సందర్భంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

సింహాద్రిపురం : ఉద్యోగ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం మంజునాథ్ తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డీఆర్డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో ఆదిత్య బిర్లా గార్మెంట్స్ వారు జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మంజునాథ్, సీడాప్ పీఓ పృథ్వీరాజ్, కంపెనీ ప్రతినిధి కిరణ్‌కుమార్‌లు మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 20 మంది మహిళలు హాజరు కాగా.. 15 మంది ఎంపికయ్యారని వారు తెలిపారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ ఆదిత్య బిర్లా కంపెనీ వారు ట్రైనీ టైలర్ ఉద్యోగంలో చేరిన తర్వాత ఉద్యోగికి జీతంతోపాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ, అటెండెన్స్ బోనస్, గ్రాట్యుటీ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీడాప్ జేసీఓ మల్లేశ్వరి, వెలుగు సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బాధ్యతగా వ్యవహరించాలి

వేంపల్లె : రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని సీఐ నరసింహులు తెలిపారు. బుధవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. దుకాణాలకు చెందిన యాజమానులకు సూచనలు ఇచ్చారు. అలాగే పబ్లిక్ స్థలాల్లో మద్యం తాగితే అలాంటి వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణం



కొండాపురం : మండలంలోని బెడుదూరు గ్రామంలో బుధవారం శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణం వేదపండితులతో ఘనంగా నిర్వహించారు. అనంతరం గణపతిపూజ పుణ్యాహవాచనం, అభిషేకం, నవగ్రహపూజ, రుద్రాభిషేకాలు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వచ్చి న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక పాత బస్టాండులో వెలసిన శ్రీపద్మావతీ సమేత శ్రీవెంకటరమణుడి ఆలయంలో బుధవారం శ్రీపద్మావతి సమేత శ్రీనివాసుల పరిణయ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు వరదాచార్యులు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఉభయదారులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వీఎన్‌పల్లె వాసికి డాక్టరేట్


జయప్రకాష్

వీరపునాయునిపల్లె : శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వీఎన్‌పల్లెకు చెందిన జయప్రకాష్‌కు డాక్టరేట్ ప్రదానం చేసింది. రాయలసీమ రచయిత్రుల కథలు పరిశీలన అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని జయప్రకాష్ జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో 100కు పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. తమ కుమారుడికి డాక్టరేట్ వచ్చినందుకు సువార్తయ్య, సులోచనలు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జయంతి


కమలాపురంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి పై అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు


పులివెందులలో వాసవీమాత అలంకారంలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు


జమ్మలమడుగులో అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పులివెందుల టౌన్ : స్థానిక అమ్మవారిశాలలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి దేవి జయంతి మహోత్సవాలలో భాగంగా బుధవారం వాసవీకన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారు వాసవీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శాశ్వత ఉభయదారుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శంకరయోగి నవీన్ కుమార్‌శర్మ ఉదయం అభిషేకం అనంతరం మహామంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవాన్ని అమ్మవారిశాల, మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వారి వీధుల మీదుగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేసు శ్రీనివాసులు, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బుధవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి జయంతి మహోత్సవం వైభవంగా నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించామన్నారు. మూలవిరాట్ అమ్మవారికి తామర గింజలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, ఆర్య వైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జయంతి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటరమణయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకి పై అమ్మవారిని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఊరేగించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మల్లెకొండు సుబ్రమణ్యం ఆధ్యర్యంలో ఉరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ముద్దనూర్పులో..

ముద్దనూరు: శ్రీవాసవీ కన్యాకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాలలో ఉదయం శ్రీకన్యకాపరమేశ్వరి విగ్రహానికి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్ర అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించి పూజల్లో పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ముట్టడి

- 4నెలలుగా మంచి నీరు రాలేదన్న మహిళలు
- పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన


పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వేంపల్లె : స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న ప్రజలకు తాగునీరు సరఫరా కాకపోవడంతో ఆ కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శి బయటికి రావాలంటూ రాజీవ్‌నగర్ మహిళాలు నినాదాలు చేశారు. గత 4 నెలలుగా కాలనీలో ప్రజలకు తాగునీరు సరఫరా కావడం లేదని కాలనీలో నివాసముంటున్న వారు కూలీ నాలి చేసుకుని జీవనం సాగిస్తున్నామని నీటీ సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు సిబ్బందికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. తాగునీటి కోసం పనులు కూడా విడిచిపెట్టి ఇంటి వద్దే అవస్థలు పడుతున్నామన్నారు. రాజీవ్‌నగర్ కాలనీలో చేతి బోర్లు కూడా లేవని దీంతో కుళాయిలకు వచ్చే నీటి కోసమే ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తాగునీరు సరఫరా చేసేంత వరకు ఇక్కడి నుంచి కదలమని మహిళలు భీష్మించుకుని కూర్చొన్నారు. అలాగే నీటి సరఫరా చేసే సిబ్బందిని కూడా మహిళలు నిలదీశారు. దీంతో పంచాయతీ కార్యాలయంలో ఉన్న పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డిలు బయటికి వచ్చి తాగునీటి సమస్యను తొందరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. బోర్లను మరమ్మతులు చేస్తామన్నారు. ఈఓగా బాధ్యతలు చేపట్టి కొద్ది రోజులు మాత్రమే అయ్యిందని ఆయా ప్రాంతాలను పరిశీలించి తాగునీటి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. పంచాయతీ ఖజానాలో డబ్బులు లేవని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి నీటి సమస్యను పరిష్కరించేందుకు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీంతో ఖాళీ బిందెలతో వచ్చిన మహిళలు వెనుదిరిగారు.

ఇ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలి


ఇ-పాస్ మిషన్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : పంటలు సాగు చేసే రైతులకు ఇ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో వ్యవసాయ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల ఎరువుల డీలర్లకు ఇ-పాస్ మిషన్ ద్వారా ఎరువులు విక్రయించే విధానంపై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎల్.0 వెర్షన్‌తో పని చేసేవన్నారు. అయితే ప్రస్తుతం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఎల్.1 వెర్షన్‌తో పని చేసే ఇ-పాస్ మిషన్లు పంపిణీ చేస్తున్నామని, ఇ మిషన్ల ద్వారానే ఎరువులు విక్రయించాలని ఆయన డీలర్లకు సూచించారు. అలాగే ఇ-పాస్ మిషన్ల పనితీరుపై అవగాహన కల్పించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ జోనల్ ఆఫీసర్ రమణారెడ్డి మాట్లాడుతూ ఎరువుల డీలర్లకు స్టాక్ వచ్చిన వెంటనే ఇ-పాస్ మిషన్‌లో నమోదు చేసుకుని వాటి ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు.అలాగే ఎరువుల కొరత ఎక్కడాలేదని, ఎక్కడా రాదని రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జేడీఏ కార్యాలయ ఏఓ గోవర్ధన్, కమలాపురం ఏఓ సరస్వతి, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సేల్స్ మేనేజర్ శివారెడ్డి, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రేపు పాలేటి గంగమ్మ తిరునాల

కమలాపురం : మండలంలోని టి.చదిపిరాళ్ల–గొల్లపల్లె గ్రామాల మధ్య వెలసి ఉన్న శ్రీ పాలేటి గంగమ్మ(మంచాలమ్మ) తిరునాల మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం నిర్వహిస్తున్నామని, సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అలాగే పాల పళ్ల ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు వరుసగా రూ.25,016, రూ.20,016, రూ.15,016, రూ.10,016, రూ.7016, రూ.5016, రూ.3016 నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన ఎద్ల యజమానులు ఆలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు.

ప్రజలకు అందని ఆధార్ సేవలు

వేంపల్లె : పట్టణంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఆధార్ సేవలు అందడం లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి అని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొంతకాలం నుంచి ఆధార్ సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కొరకు పులివెందుల, కడప ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. గతంలో రెండు ఆధార్ సెంటర్లు ఉండేవని, ఒక సచివాలయంలో కెమెరాలు పనిచేయడం లేదని, మరమ్మతులకు పంపామని అధికారులు చెబుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లతో సమానమని చెబుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. దీనిపై అధికారులు మాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆధార్ కార్డులో అన్ని వివరాలు సక్రమంగా ఉంటేనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆరు నెలల క్రితం ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తే మూడు వారాల పాటు ఆధార్ సేవలు కల్పించి తర్వాత ఇంతవరకు ఏ సచివాలయంలో ఆధార్ సేవలు అందుబాటులో లేవన్నారు. అధికారులు స్పందించి వేంపల్లెలో ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

వేంపల్లె : స్థానిక చింతలమడుగుపల్లి క్రాస్ రోడ్డు వద్ద పైపులైన్ పగిలి మంచినీరు మురికి నీటిలో కలుషితమవుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్పంచ్ స్పందించి పులివెందుల నుంచి కంప్రెసర్‌ను తెప్పించి సిబ్బందిచే మరమ్మతులు చేయించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సర్పంచ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడిగా రామాంజనేయులు

పులివెందుల టౌన్ : పట్టణంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నజీర్‌అహ్మద్ అధ్యక్షతన బుధవారం వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు గంగాధర ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు వీఆర్‌ఓల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు సి.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా బి.మార్క్, సెక్రటరీ బాబు, ట్రెజరర్ ఏకాశి ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాస రెడ్డి, భార్గవి, మెంబర్లుగా మహమ్మద్ రఫి, భవ్య, ఆర్గనైజర్ సెక్రటరీ అంకన్న, పబ్లిసిటీ సెక్రటరీ కొర్రపాటు ఓబులేసులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదుల స్థావరాల ధ్వంసం హర్షణీయం


భారత మాతకు జై అంటూ నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేంపల్లె : పహల్గాం ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం నిర్వహించిన సింధూర్ ఆపరేషన్ ద్వారా పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న స్థావరాలను ధ్వంసం చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు మునీర్‌బాషా తెలిపారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆపరేషన్ ద్వారా దాదాపు 90 మంది ఉగ్రవాదులను హతమార్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారత త్రివిధ దళాలు భారత పౌరులుగా నిరూపించి భారత దేశ సత్తాను చాటి చెప్పడం జరిగిందన్నారు.

పెహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుంది

పులివెందుల టౌన్ : ఉగ్రదాడికి పాకిస్తాన్పై భారత్ ప్రతీకారం తీర్చుకుందని, పాక్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి మెరుపు దాడి చేసిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పోరెడ్డి జస్వంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు చెనూరు కార్తీక్, వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ అధ్యక్షుడు మారుతీరెడ్డి, కౌన్సిలర్ పద్మనాభరెడ్డిలు తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భారత సైన్యం మెరుపుదాడి చేసిందన్నారు. 23 నిమిషాల్లో ఆపరేషన్ ముగించి వెనక్కి వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సాయి భరత్‌రెడ్డి, రంగా తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికులకు విజయోత్సవ శుభాకాంక్షలు

పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారతదేశ వీర జవాన్లు మెరుపు దాడి చేసి వాటిని విజయవంతంగా మట్టుపెట్టిన సందర్భంగా పట్టణంలోని శ్రీ విద్యాధరి పాఠశాలలో బుధవారం పాఠశాల సీఈవో భాను ప్రకాష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు వీర జవాన్లకు సంఘీభావం తెలియజేస్తూ మన దేశ త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు భారత్ మాతకు జై, వందేమాతరం నినాదాలతో హోరెత్తించారు.

సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెలోకి దిగుతాం


సమ్మెనోటీసు ఇస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

జమ్మలమడుగు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయకపోతే సమ్మెకు దిగుతామని మున్సిపల్ యూనియన్ నాయకులు శేఖర్, నాగన్నలు తెలిపారు. బుధవారం సీఐటీయూ కార్యదర్శి దాసరి విజయ్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ కమిషనర్‌కు ఈనెల 20వ తేదీన సమ్మెలోకి పోతున్నట్లు సమ్మెనోటీసు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే చట్టాలను తీసుకురావడంతో సమ్మెలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. ట్రేడ్ యూనియన్ చట్టం–1926, వర్క్‌మెన్ కంపెనీ సేషన్ యాక్టు 1923, వేతనాల చెల్లింపుల చట్టం 1935తో సహా కనీసం వేతనాల చట్టం –1948 చట్టాలను కేంద్రం 4 లెబర్ కోర్సుగా మార్చేసింది. ప్రస్తుతం మున్సిపల్ ఉద్యోగులకు అప్కాబ్ ద్వారా జీతాలు చెల్లించే విధంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా జీతాలు ఇప్పించే విధానాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందన్నారు. దీని ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన ఉత్సవాలు

చింతకొమ్మదిన్నె : మూలవంక గ్రామంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం ఆరాధన ఉత్సవాలను గ్రామస్తులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

పాఠశాల టాపర్‌ను అభినందించిన కలెక్టర్


కలెక్టర్ శ్రీధర్ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థి గంగా జశ్వంత్‌రెడ్డి

వేంపల్లె : పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థి రుద్ర గంగాజస్వంత్ రెడ్డిని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఈఓ షంషీద్దీన్‌లు అభినందించారు. బుధవారం కడప నగరంలో జరిగిన విద్యారత్న కార్యక్రమంలో మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచిన వారికి వారు ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు బేబీ, స్టాలిన్ ఐజాక్‌లు మాట్లాడుతూ రామిరెడ్డిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన గంగా జస్వంత్‌రెడ్డి పదవ తరగతి పరీక్షల్లో 592 మార్కులు సాధించి, టాప్ టెన్ విద్యా రత్నాల్లో 5వ స్థానంలో నిలిచారన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పెండ్లిమర్రి : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను బుధవారం డివిజనల్ పంచాయతీ అధికారి విజయభాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న తడి చెత్త, పోడి చెత్తను వేర్వేరుగా తొట్లలో నింపాలన్నారు. ఈచెత్త నుంచి ఎరువు తయారు చేసి సంపదను సృష్టించి వాటి ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయంతో పాటు గ్రామాలను శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాఘవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంఈఓ, తదితరులు

లింగాల : 2025–26 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో 5 ఏళ్లు నిండిన పిల్లలను ఉచితంగా 1వ తరగతిలో చేర్చుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ రామకృష్ణయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఆయన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. 5 ఏళ్లు నిండిన పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చేరేందుకు అర్హులని, అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ కుటుంబాలకు చెందిన గ్రామీణ ప్రాంత కుటుంబాల వారికి సంవత్సరానికి ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.1.40 లక్షలు మించి ఉండకుండా ఉండాలన్నారు. పాఠశాలకు 3 కి.మీ పరిధిలో నివాసం ఉంటున్నవారు అర్హులన్నారు. ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి శుద్ధి కేంద్రం వితరణ


తాగునీటి శుద్ధి కేంద్రాన్ని వితరణగా అందిస్తున్న దాత తుషారికా సిన్హా

తొండూరు : స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర సంక్షేమ వసతి గృహానికి బుధవారం దాత తుషారికా సిన్హా రూ.50 వేలు విలువ చేసే తాగునీటి శుద్ధి కేంద్రాన్ని వితరణగా అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. గతంలో ప్రభుత్వ బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి సందర్శించిన సమయంలో విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో ఉంచుకుని ఆయన తుషారికా సిన్హా ద్వారా తాగునీటి శుద్ధి కేంద్రాన్ని వితరణగా అందించారు. దాతను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ పులివెందుల డివిజన్ అధికారి నాగేంద్రరాజు, హాస్టల్ వార్డెన్ ఉమర్‌ఫరూక్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపులలో కందిపప్పు మాయం

- మూడు నెలలుగా అందని కంది బేడలు


పులివెందుల రేషన్ షాపు వద్ద వేచి ఉన్న కార్డుదారులు

పులివెందుల రూరల్ : రేషన్ కార్డుదారులకు కూటమి ప్రభుత్వం అందించే కందిపప్పు మాయమవుతోంది. మూడు నెలలుగా కందిపప్పు అందడంలేదని రేషన్ కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ షాపులలో కేవలం బియ్యం, చక్కరకే పరిమితమయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బియ్యంతోపాటు గోధుమలు, జొన్నలు, రాగులు, కందిపప్పు, చక్కెర సబ్సిడీపై సరఫరా చేసేవారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రేషన్ వ్యవస్థలో విపరీత మార్పులు తేవడంతోపాటు సరుకులలో కోత లేకుండా అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్డుదారులకు కొద్ది రోజులు మాత్రమే సరుకులను అందిస్తున్నారు. ఇటీవల కాలంలో బియ్యం, కందిపప్పు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కందిపప్పు బహిరంగ మార్కెట్లో కిలో రూ.140లు పలుకుతోంది. బియ్యం, చక్కెర మాత్రమే రేషన్ షాపులలో ఇస్తున్నారు. కందిపప్పు ఇవ్వడం లేదు. చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు అందించే కందిపప్పు నిలిపివేయడంతో పేదలు పప్పన్నం బదులు పచ్చడి మెతుకులు తింటూ జీవనం సాగిస్తున్నారు. రేషన్ దుకాణాల్లో మూడు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదని డీలర్లను ప్రశ్నించగా కందిపప్పు గోదాముల నుంచే సరఫరా కావడంలేదని చెబుతున్నారు. పులివెందుల మండల వ్యాప్తంగా 21,486 రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నజీర్ అహ్మద్‌ను వివరణ కోరగా కందిపప్పు ప్రభుత్వం నుంచి సరఫరా కావడంలేదన్నారు. వచ్చేనెల నుంచి తప్పకుండా కార్డుదారులకు కందిపప్పు అందజేస్తామన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయడం అవమానకరం


నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు

వేముల : ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్ మేల్స్, సూపర్‌వైజర్లపై ఎంఎల్‌హెచ్‌పీలు చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని, చాలా అవమానకరమని ఏఎన్ఎంలు తెలిపారు. బుధవారం వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏ మేల్స్, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్ల ద్వారా ఎన్నో ఏళ్ల నుంచి ప్రజా ఆరోగ్య కార్యక్రమాల్లోనూ, ఎన్నో జాతీయ హెల్త్ కార్యక్రమాలలో పాల్గొనడం జరిగిందన్నారు. మమ్ములను ఆ విధంగా అవమానకర పదజాలంతో మీడియా ముందర మాట్లాడటం చాలా అవమానకరమన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

ముద్దనూరు : మండలంలోని కొసినేపల్లెలో నరసింహనాయుడుపై అదే గ్రామానికి చెందిన ప్రసాద్ దాడి చేసిన సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ అరుణాచలం సమాచారం మేరకు.. బుధవారం రాత్రి నరసింహనాయుడు కొసినేపల్లె సమీపంలో సెల్‌ఫోన్‌లో ఎవరినో దూషిస్తూ మాట్లాడుతున్నాడు. ఇది గమనించిన ప్రసాద్ తననే నరసింహనాయుడు తిడుతున్నాడని అనుమానించి కట్టెతో అతని తలపై దాడిచేశాడు. ఈ ఘటనలో నరసింహనాయుడి తలకు తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.